- మన ఊరు-మన బడి ద్వారా నిధులు మంజూరు
- మారిన పాఠశాల రూపురేఖలు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

# సర్కారు బడికి సరికొత్త శోభ

మల్దకల్, డిసెంబర్ 2 : మండలంలోని విఠలాపురం ప్రాథమిక పాఠశాల మన ఊరు-మన బడి పథకం ద్వారా రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. తెలంగాణ ప్రభుత్వం మన ఊరు-మన బడి కింద ప్రత్యేక నిధులు కేటాయించి మరమ్మతు చేయించడం వల్ల పాఠశాల పాత భవనాలు కొత్తశోభను అలంకరించుకున్నాయి. ఆకర్షణీయంగా సరికొత్త హంగులతోపాటు మౌలిక వసతులు కల్పించారు. నూతన గది నిర్మాణం కోసం రూ.6లక్షలు, ఫ్యాన్లు, విద్యుత్, తలుపులు, కిటికీలు, తాగునీటి సంప్, వాష్‌రూంలు, ప్రహరీ తదితర వాటికి రూ.3లక్షలు కేటాయించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా కిచెన్ షెడ్డు, మరుగుదొడ్లు పూర్తి చేశారు. దీంతో మౌలిక సదుపాయాలతోపాటు విద్యార్థులకు డ్యూయల్ డెస్క్‌లు అందించారు.



డ్యూయల్ డెస్క్‌లో కూర్చున్న విద్యార్థులు



మరమ్మతులు చేపట్టిన ప్రాథమిక పాఠశాల

### పాఠశాల చాలా మారిపోయింది..



ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు 163 మంది విద్యార్థులు చదువు తున్నారు. మన ఊరు- మన ప్రణాళికతో సీఎం కేసీఆర్ నిధులు ఇవ్వడం వల్ల విద్యార్థులకు మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించారు. పాఠశాలకు రంగులు వేసి కొత్త భవనాలు ఏర్పాటు చేయడం వల్ల రూపురేఖలు మారిపోయాయి.

-పురుషోత్తంరెడ్డి, సర్పంచ్, విఠలాపురం

### విద్యార్థుల సమస్యలు తీరాయి..



ప్రాథమిక పాఠశాల మన ఊరు- మన బడి కింద రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల మరమ్మతుకు నిధులు మంజూరు చేసి సమస్యలు పరిష్కరించారు. గతంలో సమస్యలతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. నేడు ప్రహరీ, నూతన గదులు, డ్యూయల్ డెస్క్‌లు ఇలా అన్ని వసతులు సమకూరడంతో విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారు.

- సత్యారెడ్డి, హెచ్‌ఎం, విఠలాపురం

## మహిళా చట్టాలపై అవగాహన

మానవపాడు, డిసెంబర్ 2 : మహిళా చట్టాలపై జిల్లా మహిళా సాధికారిత కేంద్రం కో ఆర్డినేటర్ జ్యోత్స్న శనివారం మండల కేంద్రంలోని గంగు వెంకటకృష్ణారెడ్డి జూనియర్ కళాశాలలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ పోషకాహారం, న్యూట్రీషన్, రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి విద్యార్థులకు వివరించారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుంటూ హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. బాలికలు ఉన్నత చదువులు చదవాలన్నారు. బాలల హక్కులకు ఆటంకం కలిగితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో సరోజ, నాగలక్ష్మి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ధన్వంతరి వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

అయిజ, డిసెంబర్ 2 : మండలంలోని ఉత్తనూర్‌లో ధన్వంతరి వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం ధన్వంతరి వేంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవ, అభిషేకం, అలంకరణ చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత ధన్వంతరి వేంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణానికి సమీపంలోని స్వయంభూ కట్టకింద తిమ్మప్పస్వామిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## టీఆర్‌టీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ఎర్రవల్లి చౌరస్తా, డిసెంబర్ 2 :ఎర్రవల్లి మండలంలోని పదోపటాలం జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం తెలంగాణరాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్‌టీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా హెచ్. రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధరూరు, డిసెంబర్ 2 : తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శివానందన్‌గౌడ్ శనివారం తెలిపారు. మండలంలోని ఎములోనిపల్లికి చెందిన కుర్వ ఆంజనేయులు(50) తాగుడుకు బానిసయ్యాడు. నవంబర్ 23వ తేదీన తాగి ఇంటికి రాగా, కుటుంబీకులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆంజనేయులు అదే రోజు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూల్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య మణేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## దాడిచేసిన వారిపై కేసు నమోదు

ధరూరు, డిసెంబర్ 2 : ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటుండగా మరో ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివానందన్‌గౌడ్ శనివారం తెలిపారు. మండలంలోని ఉప్పేరుకు చెందిన బోయ సత్యమ్మ(45) అదే గ్రామానికి చెందిన మాసిరెడ్డి గ్రామంలో మాట్లాడుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన పెద్ద సంజీవులు, చిన్న సంజీవులు సత్యమ్మ, మాసిరెడ్డిపై దాడిచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

మహబూబ్‌నగర్, డిసెంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికల కు సంబంధించి ఆ దివారం కౌంటింగ్ చేస్తున్న సందర్భం గా సకల ఏర్పాట్లు చక్కగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా కలెక్టర్ రవినాయక్‌తో మాట్లాడారు. లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు ముందే చేసినందున పోస్టల్ బ్యాలెట్, అదేవిధంగా ఈవీఎంలు, సీఆర్పీ ఎన్నికల లెక్కింపునకు సంబంధించి ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై సూచనలు చే శారు. ఫలితాలు వెలువడిన వెంటనే రౌండ్ వారీగా వివరాలను అప్లోడ్ చ యాల్సిన అవసరం ఉందన్నారు. కౌంటింగ్ పూర్తి అయిన తరువాత ఈవీ ఎం భద్రత, తదితర అంశాలపై ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి కేవీవీ రవికుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి ఉన్నారు.

## వరి కోతలకు సిద్ధం

అయిజ, డిసెంబర్ 2: వానాకాలంలో సాగుచేసిన వరిపంట కోతకు సిద్ధమైంది. ఈ నెల చివరి నాటికి వరి కోతలను కోసేందు కు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రధానంగా మండలంలోని నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని కాల్వలు, బోరుబావులు, చెరువుల వద్ద వరి నాట్లు వేశారు.నెలాఖరులో వరి కోతలు కోసేందుకు సిద్ధమవుతున్నట్లు రైతులు తెలిపారు. ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, మద్దతు ధరకు ధాన్యం కొనుగోలుచేయాలని రైతులు కోరుతున్నారు.



అయిజ సమీపంలో సాగు చేసిన వరిపంట

## ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ దేవన్న

ఉండవెల్లి, డిసెంబర్ 2 : అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బీసమ్మ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ బీసమ్మ, ఎంపీడీవో ఆంజనేయరెడ్డి అధ్యక్షతలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా మూడు నెలల ప్రగతి నివేదికను అధికారులు చదివి వివరించారు. సకాలంలో వర్షాలు కురువకపోవడంతో మిరప పంటకు తెగుళ్ల బెడద అధికంగా ఉందని, వ్యవసాయశాఖ ఏఈవోలు, ఏవోలకు తెలిపినా పట్టించుకోవడం లేదని సభ్యులు తెలిపారు. ఈ విషయమై ఏవో సురేఖను వైస్ ఎంపీపీ దేవన్న ప్రశ్నించారు. విధిగా వ్యవసాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించేలా చూడాలని కోరారు. ఇందుకు ఏఈవోలకు ఆదేశాలు జారీ చేస్తానని ఏవో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ కు డీజిల్ బిల్లు, ట్యాంకర్ బిల్లులు చెల్లించడం లేదని సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు లోకేశ్వర్‌రెడ్డి ఏపీవో జయ శంకర్‌కు తెలిపారు. ఇందుకు ఏపీవో స్పందిస్తూ బిల్లులు మంజూరయ్యేలా చూస్తామని తెలిపారు. అనంతరం పలు సమస్యలపై సభలో చర్చించారు. సమావేశంలో ఏవో సురేఖ, ఎంఈవో శివప్రసాద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

గద్వాల, డిసెంబర్ 2 : సాధారణ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గద్వాల మండలం గోన్‌పాడ్ సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రితిరాజ్, ఎన్నికల కౌంటింగ్ పరిశీలకురాలు అనురాధ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్‌ను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. గద్వాల నియోజకవర్గంలో 303 పోలింగ్ బూత్‌లకు సంబంధించి 2,13,283 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని, వాటి ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుల్స్, రెండు పోస్టల్ బ్యాలెట్ టేబుల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఓట్ల లెక్కింపు 22 రౌండ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలంపూర్ నియోజకవర్గానికి సంబంధించి 293 పోలింగ్ కేంద్రాల్లో 1,96,307 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. వీటి లెక్కింపు కోసం 14 టేబుల్స్ ఏర్పాటు చేసి 21 రౌండ్ల ద్వారా ఓట్ల లెక్కింపు చేపడతారన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం అదనంగా రెండు టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలు, అభ్యర్థుల, ఏజెంట్ల రాకపోకలకు సంబంధించి వేర్వేరుగా మార్గాలు ఏర్పాటు చేయగా, బారికేడ్లను పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, అపూర్వచౌహాన్, ఆర్డీవో చంద్రకళ తదితరులు ఉన్నారు.

## అంబాభవానీ మాత జాతర ఉత్సవాలు

గట్టు, డిసెంబర్ 2 : మండల కేంద్రంలో అంబాభవానీ మాత జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పందిరి పూజతో జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం రాత్రి ప్రభోత్సవం కనులపండువ గా నిర్వహించారు. శనివారం కలశపూజను నిర్వహించారు. అమ్మవారి బిందెసేవ కార్యక్రమాన్ని గట్టులోని పురవీధులగుండా ఊరేగించారు. జాతర సందర్భంగా భక్తులు దాసంగాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.



తేరు వద్ద కలశానికి పూజలు చేస్తున్న భక్తులు

అంబాభవానీ మాత